జవాన్ మురళీనాయక్ తెగువ స్ఫూర్తిదాయకం

నందిగామటౌన్: భారత్–పాక్ యుద్ధంలో యువ జవాన్ మురళీనాయక్ తెగువ స్ఫూర్తిదాయకమని, నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మురళీనాయక్ మృతి అత్యంత బాధాకరమన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు శనివారం మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ మురళీనాయక్ వంటి జవాన్‌ను దేశం కోల్పోవటం బాధాకరమని చెప్పారు. చిన్నవయసులోనే భారత ఆర్మీలో చేరి దేశరక్షణలో తనవంతు పాత్ర పోషించిన మురళీనాయక్ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వీరజవాన్ కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉండాలని కోరారు. వీర జవాన్‌కు నివాళులర్పించినవారిలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి, పార్టీ పట్టణ కన్వీనర్ మహ్మద్‌మస్తాన్, జిల్లా అధికార ప్రతినిధి నెలకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు పాములపాటి రమేష్, మువ్వల శ్రీను, షేక్ యాకుబ్‌అలీ, షేక్ సైదా, పోతురాజు, సుభాని, దుర్గ, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరజవాన్ త్యాగం మరువలేనిది...

జగ్గయ్యపేట అర్బన్: మాతృభూమి కోసం ఆత్మబలిదానం చేసిన వీరజవాన్ మురళినాయక్ త్యాగం మరువలేనిదని పలువురు నాయకులు కొనియాడారు. భారత సైన్యంలో విధులు నిర్వహిస్తూ అమరుడైన శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన మురళినాయక్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తూ శనివారం పట్టణంలోని పలు సంఘాలు, సంస్థలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వీరజవాన్ మురళినాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. రైతుబజారు సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కూడలిలో పార్టీ శ్రేణులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ భారత్–పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్ చూపించిన తెగువ, ఆయన త్యాగం దేశంలోని ప్రతి పౌరునికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. మురళి నాయక్ కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. దేశరక్షణకు మొదటి ప్రాధాన్యత నివ్వాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు మాలో స్ఫూర్తిని నింపుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



పేటలో రైతుబజారు కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు, పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు



నందిగామలో వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు, నాయకులు



కంచికచర్లలో ర్యాలీ చేస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు

పేట మార్కెట్ యార్డులో...

స్థానిక మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో రైతులు, నాయకులతో కలసి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురళీ నాయక్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, డీసీ చైర్మన్, వైస్ చైర్మన్లు ఏలూరి గోపాలరావు, మన్నె నారాయణరావు, కౌన్సిలర్లు సైదేశ్వరరావు, ఇంద్రి నరసింహారావు, రైతులు పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా ర్యాలీ ...

కంచికచర్ల: పాకిస్తాన్ ఉగ్రవాదులను అణచివేసేందుకు భారత సైన్యం శక్తివంచన లేకుండా పనిచేస్తోందని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు కొనియాడారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను లెక్కచేయకుండా యుద్ధం చేస్తున్న భారత సైనికులకు మద్దతు తెలియజేస్తూ విశ్రాంత ఉద్యోగులు శనివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయం మీదుగా పెట్రోలుబంక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. దేశ రక్షణ కోసం వీరమరణం పొందిన మురళీనాయక్‌కు ప్రత్యేక శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, నాయకులు చలసాని నాగేశ్వరరావు, చాపలమడుగు స్వర్ణలత, లక్ష్మీనారాయణ, లక్ష్మణరావు, బీవీ సర్వేశ్వరరావు, పెద్దినీడి కోటేశ్వరరావు, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భూములను కాపాడాలంటూ ఎమ్మెల్యేకు మొర

కంచికచర్ల : క్వారీల కాలుష్యం కారణంగా తమ పంటభూములు దెబ్బతింటున్నాయని, వాటిని కాలుష్యం బారి నుంచి కాపాడాలంటూ కంచికచర్ల మండలం పరిటాల గ్రామరైతులు శనివారం నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు మొరపెట్టుకున్నారు. ఈ మేరకు ఆమెకు వినతిపత్రం అందజేసి, తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ పరిటాల శివారు దొనబండ రాతి క్వారీలు, క్రషర్ల సమీపంలోని 400 ఎకరాల పంటభూముల్లో దుమ్ము, ధూళి పడుతుండటంతో పంటలు పండక నష్టపోతున్నామన్నారు. రాతి క్వారీల్లో బ్లాస్టింగ్ సమయంలో పెద్దపెద్ద బండ రాళ్లు పొలాల్లోకి వచ్చి పడుతున్నాయని, దీంతో వ్యవసాయ పనులు చేసే సమయంలో రాళ్లు పడి పలువురు గాయపడ్డారని గుర్తుచేశారు. పంటనష్టపరిహారం ఇవ్వాలని కోరితే క్వారీ యజమానులు బెదిరిస్తున్నారని ఎమ్మెల్యే వద్ద వాపోయారు. ఆభూములు ఇతరులకు విక్రయించేందుకు యత్నించినా, క్వారీల యజమానులు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యను పరిష్కరించి తమను ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో రైతులు ఎం.ఓంకారబాబు, బండ్ల నాగేశ్వరరావు, ఆకుల వెంకట్రామయ్య, పురమా సత్యనారాయణ, అల్లూరి పకీరయ్య, సీహెచ్ సత్యనారాయణ, జె.దుర్గ, జిక్కుల హనుమంతరావు, జె.రామారావు, కె.సైదాబాబు, గుదే సత్యనారాయణ, చల్లగుండ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నందిగామ ఎమ్మెల్యే సౌమ్యకు వినతిపత్రం అందజేస్తున్న పరిటాల రైతులు

నేటి నుంచి లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారి తిరునాళ్ల

నందిగామ రూరల్: మండలంలోని లింగాలపాడులో వేంచేసియున్న లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారి ఆలయం తిరునాళ్ల మహోత్సవాలకు ముస్తాబైంది. విద్యుద్దీప కాంతులతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు తిరునాళ్ల మహోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ నరసింహ మూర్తి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, మూలమంత్ర హోమాది క్రతువులు, అమ్మవారి దీక్షాదారుల ఇరుముడి సమర్పణ, ఆలయ ధర్మకర్త చిరుమామిళ్ల లక్ష్మీసాయిబాబు అమ్మవారికి పసుపు కుంకుమలు, పట్టువస్త్రాలు సమర్పించడం, రాత్రికి అమ్మవారి రథోత్సవం జరుగుతుందన్నారు. అదేవిధంగా 12న అమ్మవారికి ఊంజల్‌సేవ, 13న నాభిశిల బోనాలు, 14న గ్రామ బోనాలు, 15న దీవెన బండారు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా రోజూ రాత్రివేళల్లో సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిరునాళ్ల మహోత్సవాలను విజయవంతం చేయాలని ఈఓ కోరారు.



విద్యుద్దీపాలంకరణలో లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారి ఆలయం

అమ్మవారికి ప్రత్యేక పూజలు

చందర్లపాడు(నందిగామటౌన్): చందర్లపాడు గ్రామంలో వేంచేసియున్న గ్రామదేవత అలివేలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మహోత్సవాలలో భాగంగా శనివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. రాత్రికి పలురకాల పుష్పాలు, విద్యుద్దీపకాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఏటా వైశాఖ త్రయోదశి సందర్భంగా తిరునాళ్ల మహోత్సవాలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ దుర్గామహేశ్వరరావు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం



నందిగామరూరల్: పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అప్పటి వరకు ఎండవేడిమి ఉన్నప్పటికీ సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులు బలంగా వీయడంతో మామిడి, అరటి తోటలు దెబ్బతిన్నాయి. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడ్డారు. భారీ ఈదురుగాలులు వీయడంతో పంటలపై కప్పిన పట్టాలు సైతం పైకిలేచిపోయి వరిధాన్యం తడిసి ముద్దయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మద్దతు ధరకు కొనుగోలు చేయకుంటే ఆత్మహత్యలే శరణ్యమని, తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



కంచికచర్ల: వేసవికాలంలో గండేపల్లిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. ఇటీవల గ్రామంలో ఏర్పాటు చేసిన మూడు బోరు పంపుల ప్లాట్‌ఫాం పనులను శనివారం చేపట్టారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఎంపీపీ మలక్‌బషీర్ మండల పరిషత్ నిధులు మంజూరు చేయడంతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని వివరించారు. ఎగువ ప్రాంతాలకు ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, మెకానిక్‌లు పుల్లారావు, సత్యనారాయణ మహిళలు పాల్గొన్నారు.

తల్లి ప్రాముఖ్యతపై పిల్లలకు అవగాహన



పెనుగంచిప్రోలు: మదర్స్ డే ను పురస్కరించుకుని శనివారం ముందస్తుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులను పిలిపించి చిన్నారులచే వారి కాళ్లు కడిగించి పాదాభివందనం చేయించారు. ఈసందర్భంగా తల్లి ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, జయలక్ష్మి, విమల, నాగమణి, రాజేశ్వరి, సునీత, ఝాన్సీ, ఎంఎస్‌కెలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, పోలవరపు సాహితీ సమితి, సంగీత సామ్రాట్ సంగీత సంస్థ, కేవీ బ్రహ్మానందరావు కళావేదిక ఆధ్వర్యంలో నెల వారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా భక్తి సంగీతం, సీతారామ కల్యాణం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గాయనీ గాయకులు మల్లీశ్వరి, శ్యాంప్రసాద్, స్వాతి మీరా కుమార్, అయ్యప్ప రాంమాంజీలు పలు భక్తి గీతాలను ఆలపించారు. సినీ నటి, విఖ్యాత హరికథా భాగవతారిణి పడాల కల్యాణి హరికథాగానం చేశారు. సాయిబాబు వైలెన్‌పై, మృదంగంపై పి.చైతన్య సహకరించారు. సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు మాట్లాడుతూ హరికథా సంప్రదాయాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. చింతకాయల చిట్టిబాబు, కె.డేవిడ్‌రాజు, ఆదిరాల జయప్రభ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు హరికథా భాగవతారిణి కల్యాణిని ఆత్మీయంగా సత్కరించారు.

క్లుప్తంగా

వారంలో సమీకృత దాణా పంపిణీ చేస్తాం

పశువైద్యాధికారి విజయ్‌విశ్వనాథ్

సాక్షి ఎఫెక్ట్

కంచికచర్ల: పచ్చగడ్డి, ఎండు గడ్డి అందుబాటులో లేకపోవడంతో పాడిరైతులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 10వతేదీన 'గడ్డికీ గడ్డుకాలమే' శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనానికి కంచికచర్ల మండల పశువైద్యాధికారి కొండూరి విజయ్ విశ్వనాథ్ స్పందించారు. వారం రోజుల్లో పాడిరైతులకు 50శాతం సబ్సిడీపై సమీకృత దాణా పంపిణీ చేస్తామని శనివారం వివరించారు. మండలంలో 206మంది పశుపోషకులు సమీకృత దాణాకు అర్జీ పెట్టుకున్నారన్నారు. వీరందరికీ 10.3 మెట్రిక్ టన్నులు దాణాను వారంరోజుల్లో పంపిణీ చేస్తామని వివరించారు. ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం పెంచుకునేవారికి ప్రభుత్వం నుంచి రూ.32,992 అందజేస్తుందన్నారు. పశుపోషకులకు 75శాతం రాయితీపై పశుగ్రాస విత్తనాలు అందజేస్తామని, ప్రస్తుతం మూడు టన్నుల పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావలసినవారు సంప్రదించాలని విజయ్‌విశ్వనాథ్ సూచించారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



గండేపల్లి(కంచికచర్ల): అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న గండేపల్లికి చెందిన బొక్కా దేవమాతకు మహిమ ఫౌండేషన్ కమిటీ రూ.7వేలు ఆర్థికసాయం అందజేసింది. ఈసందర్భంగా కమిటీ సభ్యులు, క్రీస్తు సంఘ సువార్తికులు సురేష్, ఎం.ఆనంద్ మాట్లాడుతూ పేదలకు తమ వంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారిని గుర్తించి, వారికి తమ ఫౌండేషన్ ద్వారా ఆర్థికసాయం అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మేజర్ శివాజీ, ఐలపోగు పుల్లారావు, ఉప్పులూరి మోషే తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కబడ్డీ కోచింగ్ క్యాంపు ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: క్రీడా శిక్షణా శిబిరాల ద్వారా విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను మెరుగుపరచుకోవచ్చని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. పట్టణంలోని శ్రీచైతన్య స్కూల్ గ్రౌండ్‌లో ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కబడ్డీ కోచింగ్ క్యాంపును ఎమ్మెల్యే తాతయ్య శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా శిక్షణా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోచింగ్ క్యాంపును ఏర్పాటుచేసిన నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజా, కబడ్డీ కోచ్ శ్యామ్, కర్రసాము కోచ్ నరేష్, మహిళల కోచ్ రమ్య, బ్యాడ్మింటన్ అసిస్టెంట్ కోచ్ జీవన్, గాలం శ్రీను, బాల, కోటి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరునికి తైలాభిషేకాలు



నందిగామటౌన్: పట్టణంలో వేంచేసియున్న శుకశ్యామలాంబ సహిత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలోని నవగ్రహాలకు శనివారం అర్చకులు తైలాభిషేకం నిర్వహించారు. శని త్రయోదశి సందర్భంగా నవగ్రహాలకు ప్రత్యేక పూజల అనంతరం అభిషేకాలు, పూజలు చేశారు. పలు రకాల పంచామృతాలతో శనీశ్వరునికి తైలాభిషేకం చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు, నవగ్రహాలకు తైలాభిషేకాలు నిర్వహించారు.

19న బహుజన సంకల్ప సభ



నందిగామ రూరల్: నందిగామలోని ఓసీ క్లబ్‌లో ఈనెల 19న బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహుజన్ సంకల్ప సభను విజయవంతం చేయాలని ఆపార్టీ రాష్ట్ర సమన్వయకర్తలు పూర్ణచంద్రరావు, పరంజ్యోతి, రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం బీఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. బహుజన సంకల్ప సభ పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చులకూర పుష్పరాజ్, నాయకులు యరగొర్ల ఉదయ్‌కిరణ్, ప్రభుదాసు, దేవ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నందిగామరూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ముందుగా విశ్వక్సేనారాధన, రక్షాబంధనం, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హోమాది క్రతువులు, ధ్వజారోహణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పబ్బతి నరసింహారావు, కొత్త వేణుమాధవ్, అన్నవరపు వెంకట రమణ, పెద్దసంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దత్తత ఆలయమైన శ్రీధర్మపురి యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం రాత్రి ఏడున్నర గంటలకు స్వామివారి కల్యాణోత్సవానిన నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కిషోర్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

బైక్ స్కిడ్ - వ్యక్తికి గాయాలు



గాయపడిన సంగిరెడ్డి

వీరులపాడు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..గంపలగూడెం మండలం పల్లెర్లమూడి గ్రామానికి చెందిన లక్కిరెడ్డి సంగిరెడ్డి శనివారం కంచికచర్లలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని జగన్నాధపురం గ్రామంలోని చర్చి మలుపు వద్ద రోడ్డుపై పడిన కంకర కారణంగా వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని 108 సహాయంతో నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కంచికచర్ల మండలంలోని దొనబండ క్వారీల నుంచి కంకర లోడుతో తెలంగాణకు వెళ్తున్న లారీల నుంచి అధిక మొత్తంలో కంకర రోడ్డుపై పడటమే ఈ ప్రమాదానికి కారణమని గ్రామస్తులు చెబుతున్నారు .

ఘనంగా జెండా ప్రతిష్ఠ



వీరులపాడు: శాంతియుత సమాజమే క్రీస్తు సందేశమని చర్చి ఫాదర్ నీలూరి ఊర్దురాజు పేర్కొన్నారు. మండలంలోని జమ్మవరం, బోడవాడ గ్రామాలలోని పరిశుద్ధ ఊర్దుమాత ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి జెండా ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తి గీతాలు ఆలపించారు.13న పరిశుద్ధ ఊర్దుమాత ఆలయ పునః ప్రతిష్ఠా కార్యక్రమం జరుగుతుందని ఊర్దురాజు తెలిపారు. అనంతరం చర్చిలో దివ్యబలి పూజా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ నాయకులు కర్ల రాజు, యాదాల దాసు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

191మందికి కంటి పరీక్షలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా శంకర నేత్రాలయం వైద్యులు 191మందికి వైద్య పరీక్షలు చేసి 80మందిని శుక్లాల ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. ఫౌండేషన్ సభ్యులు కట్టా నరసింహారావు, ముల్లంగి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రయాణికుల జేబులకు చిల్లు

- లింగాల కాజ్‌వేపై నిలిచిన రాకపోకలు
- తీవ్ర ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రయాణికులు
- ఆటోవాలాలకు పెరిగిన డిమాండ్
- రూ.20 నుంచి రూ.80కి పెరిగిన ఆటోచార్జీ



మరమ్మతుల కారణంగా లింగాల కాజ్‌వేపై నిలిచిన రాకపోకలు

వత్సవాయి: లింగాల వద్ద మునేటిపై ఉన్న కాజ్‌వే మరమ్మతు పనుల ప్రారంభం కారణంగా ట్రాఫిక్‌ను పెనుగంచిప్రోలు మీదుగా మళ్లించడంతో ప్రయాణికులకు కొత్త కష్టాలు వచ్చాయి. ఇప్పటివరకు కాజ్‌వే దెబ్బతినడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. కాజ్‌వేకు మరమ్మతులు చేపట్టే క్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేసి, ట్రాఫిక్‌ను పెనుగంచిప్రోలు మీదుగా మళ్లించారు. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. లారీలు, కార్లతో పాటు ఇతర సొంత వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇక ఈమార్గంలో ఆటోలను ఆశ్రయించే ప్రయాణికులకు ఆటోవాలాలు చుక్కలు చూపిస్తున్నారు. మక్కపేట నుంచి వత్సవాయికి గతంలో రూ.20 ఆటోచార్జీ ఉండగా, ప్రస్తుతం ఆటోవాలాలు రూ.80 వసూలు చేస్తున్నారు. అదేమంటే చుట్టూ తిరిగి వెళ్లాలి..ఆయిల్ ఎక్కువ పడుతుంది..ఇష్టం ఉంటే ఎక్కండి లేకుంటే మీఇష్టం అని ఖరాకండీగా చెబుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. వత్సవాయి మండలంలోని అత్యధిక కీలక రవాణా మార్గంలోని లింగాల కాజ్‌వేకు మరమ్మతు పనుల నేపథ్యంలో 12 గ్రామాల ప్రజలకు వత్సవాయితో సంబంధాలు లేకుండాపోయాయి. వత్సవాయి వైపు ఉన్న 12 గ్రామాల ప్రజలకు జగ్గయ్యపేట వెళ్లేందుకు రాకపోకలకు అదే పరిస్థితి ఏర్పడింది. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలకు చెందిన ప్రజలకు పక్కనే ఉన్న ఉమ్మడి ఖమ్మంజిల్లాకు చెందినవారితో సంబంధ బాంధవ్యాలు అధికం. దీనికితోడు ఈప్రాంత ప్రజలు మొదటి నుంచి ఉన్నత విద్య, మెరుగైన వైద్యసేవల కోసం సమీపంలోని మధిర, ఖమ్మం ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. చిల్లకల్లు వైరా రహదారిపై ఆంధ్ర, తెలంగాణలను లింగాల కాజ్‌వేనే కలుపుతుంది. ఈక్రమంలో ప్రజలు రాకపోకల కోసం ఆటోలను ఆశ్రయించక తప్పని పరిస్థితి. ఈపరిస్థితిని ఆటోవాలాలు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ కాజ్‌వే పనులు మరో రెండునెలలపాటు కొనసాగనుండటంతో అప్పటివరకు ఈ తిప్పలు తప్పేలా లేవని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

తాత్కాలిక కచ్చా రోడ్డు ఏర్పాటుకు డిమాండ్...



జగ్గయ్యపేట అర్బన్: లింగాల కాజ్‌వే మరమ్మతుల దృష్ట్యా రాకపోకలకు ఇబ్బంది లేకుండా మునేటిపై తాత్కాలిక కచ్చా రోడ్డును నిర్మించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో జాతీయ రహదారి తర్వాత అంతటి రద్దీ ఈ చిల్లకల్లు– వైరా రోడ్డులో ఉంటుందన్నారు. కాజ్‌వే మరమ్మతుల కారణంగా చిల్లకల్లు, మక్కపేట నుంచి వత్సవాయి తదితర గ్రామాలు వెళ్లాలంటే చుట్టూతా 14 కిలోమీటర్లు మేర అదనంగా ప్రయాణించాల్సి వస్తుండటంతో వాహనచోదకులు, ప్రయాణికులపై అదనపు భారం పడుతోందన్నారు. పాలకులు, అధికారులు స్పందించి కచ్చా రోడ్డు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంచికచర్ల : ఏడాది నుంచి భార్య కాపురానికి రావట్లేదని మనస్తాపంతో గడ్డి మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భర్త శనివారం మృతిచెందాడు. ఎస్‌ఐ బీ రాజు కథనం మేరకు కంచికచర్లలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం సమీపంలో నివాసముంటున్న గోళ్ల ప్రవీణ్(24)కు పెనుగంచిప్రోలు మండలం తోటచర్లకు చెందిన నాగదుర్గతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే భార్యభర్తల మధ్య ఏడాది కిందట చిన్న గొడవ జరగడంతో ఆమె తన కుమార్తెలను తీసుకుని తోటచర్లలోని పుట్టింటికి వెళ్లింది. నాటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురైన ప్రవీణ్ ఈనెల నాలుగోతేదీన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అతన్ని వైద్య చికిత్స కోసం విజయవాడ ప్రవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.